# అలా రాసిపెట్టి వుంది

-ఆదూరి వెంకట సీతారామమూర్తి

"చీరాలనించి మీకేదో శుభలేఖ వచ్చింది" అంది భారతి నేను ఆఫీసు నుండి ఇంట్లోకి వస్తూంటే-

"చీరాల్లో ఎవరున్నారు మనకీ? అది మనది కాదేమో. అడ్రసూ అదీ సరిగా చూసేవా"

"సరిగ్గానే చూశాను- మీ పేరు మీదే వుంది ఆ పెళ్లి కార్డు"

స్నానం, కాఫీ అయ్యేక తీరుబడిగా చూశానా కవర్ని. చీరాలనించే వచ్చినట్టు వుంది. ఫ్రం ఎడ్రసులోని పేరు చూస్తే పరిచయమున్న గుర్తు కాదు- నాలుగు మూలలా పసుపు బొట్లు పెట్టి వున్న ఆ కవరు అతికించి కూడా వుంది - నెమ్మదిగా తెరిచి చూశాను.

లోపల... సీదాసాదా పెళ్లికార్డు- దాంతోపాటు మడిచి వున్న ఓ ఉత్తరం కూడ. మొదట ఆశ్చర్యమనిపించింది. పెళ్లి కార్డులోని పేర్లేవీ పరిచయమున్నవి కావు. ఆత్రంగానే ఉత్తరం మడత విప్పేను.

డియర్ సర్,

నన్నీపాటికి మీరు మర్చిపోయే వుంటారు - కానీ మిమ్మల్నీ, మీరు చేసిన ఉపకారాన్నీ నేనెన్నటికీ మర్చిపోలేను - సుమారుగా తొమ్మిది, పది నెలల క్రితమనుకుంటా.. నేను, మా అమ్మాయి పెళ్లి విషయంలో మిమ్మల్ని సంప్రదించాను - ఆ సందర్భంలో మీరు చేసిన సూచన నాకు మొదట ఆశ్చర్యమనిపించింది. లోకంలో 'అటువంటి వారు' కూడా వుంటారా అన్పించింది. శాస్త్రాల మీద ప్రజలకు నమ్మకాల్ని కలిగించవలసిన వారే నమ్మకాల్ని వమ్ముచేసేలా చేస్తుంటే సామాన్యులు దేన్ని నమ్మాలి అన్పించింది - బరువు బాధ్యతలు మోసే వారికే గాని అర్థంకావు. ఈ అమ్మాయి మా చివరి సంతానం. అందంగానే వుంటుందంటారు - చూపులకొచ్చి చూసిన ప్రతివారూ ముచ్చటపడ్డా ఏదో ఓ కారణం వల్ల సంబంధం కుదరక పెళ్లి వెనక్కు పోతూనే వచ్చింది. కారణం మీరు వివరించి వుండకపోతే నాకెన్నటికీ తెల్సి వుండేదే కాదు - పరిష్కార మార్గం కూడా మీరే చూపించడం నా అదృష్టంగానే భావిస్తున్నాను - మీ సూచన ప్రకారం నేను నిర్ణయం తీసుకోడానికి ఆర్నెల్లు పట్టింది - పాదమే సరిచేశారో, గణమే సవరించారో కాలమే మరికాస్త ముందుకు తిప్పారో - అంతా మీరు చెప్పిన ఆయనే పుణ్యం కట్టుకున్నారు - చెప్పకేం... ఆ తర్వాత వచ్చిన నాలుగు సంబంధాలూ గొప్పింటి వారి సంబంధాలే వచ్చాయి - యోగ్యులైన మగపిల్లలే. అందరికీ మా అమ్మాయి నచ్చింది. అందువల్ల అమ్మాయికి ఇష్టమైన సంబంధం ఎంచుకుందికి మాకు అవకాశం కలిగింది. ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను. పెళ్లి విజయవాడలో. మీరొస్తే నాకెంత సంతోషమో మాటలతో చెప్పలేను - తప్పకుండా రండి.

-వామనరావు

ఉత్తరం మడిచాను-

నా జ్ఞాపకాలు తొమ్మిది నెలల వెనక్కు పోయాయి.

○ ○ ○

"మీనరాశి కదా పెద్ద పెద్ద కళ్లుంటాయి - అందంగా ఆకర్షణీయంగా వుంటుంది. చాయ కాస్త తక్కువైనా ఒడ్డూ పొడవుగా వుంటుంది. అవునా?"

అవునన్నట్లు తలూపింది భారతి మార్తాండశాస్త్రి గారి ప్రశ్నకి.

## చేతి వ్రాత - నుదిటి వ్రాత

అ, ఆలు దిద్దుకున్నాను
అక్షరాలు నేర్చుకున్నాను
చూచి వ్రాత వ్రాశాను
చేతి వ్రాత తీర్చిదిద్దుకున్నాను
అందరూ అవి అక్షరాలు కాదన్నారు
ముత్యాలుగా అభివర్ణించారు
నా దస్తూరి చూసి మెచ్చుకున్నవారు
నా నుదుటి వ్రాత చదవలేకపోయారు
అది బ్రహ్మలిపిట
అది విధాత వ్రాతట
గ్రాఫిక్ ఎనలిస్ట్‌లకే అంతుపట్టదట!

-తాజీ ప్రసాద్

"సౌమ్యంగా వుంటుంది - మాట కూడా నెమ్మదే. అవునా?"

"నిజమే"

"అందుకనే చూడగానే మీరాపిల్లని కోడలిగా చేసుకుందామనుకున్నారు. అవునా?"

"అందుకోసమే గదండీ మీ దగ్గరకొచ్చిందీ"

"వచ్చారు సరే. మరి పెళ్లికి వధూవరుల పొంతన కుదరొద్దూ? చూడండి అమ్మాయికి శుక్రుడు ఏ స్థానం లో వున్నాడో! కుజ దోషం లేదని అంటారు గానీ కుజ స్పర్శ బాగానే వుంది. యోని కూటం కూడ బాగానే వుంది గానీ ఆరోగ్యరీత్యా గైనిక్ ట్రబుల్స్ ఎక్కువగా వుంటాయి. గ్రహమైత్రంటారా బొత్తిగా లేదు - గణ మైత్రి కూడ లేదు. అమ్మాయి ఎంత బాగా వున్నా జాతకం మాత్రం బొత్తిగా బాగులేదు - మీ వాడికి మాత్రం కుదరదు - ఇక ఆ పిల్ల తల్లిదండ్రులు ఈ జాతకాన్ని ఇలాగే ఎంతమందికి చూపించుకు తిరిగినా ఈ పిల్లకు పెళ్లికాదు-" అంటూ ఆగేరాయన.

"అయితే ఈ పిల్లకి పెళ్లే కాదంటారా" అడిగేన్నేను.

"ఎందుక్కాదూ. జాతకంలో ఒకట్రెండు మార్పులు చేస్తే భేషుగ్గా అవుతుంది."

"మార్పులు చేస్తే చేసుకోవచ్చంటారా" అడిగింది భారతి అమాయకంగా.

"మీ అబ్బాయికి కుదరదమ్మా. నేను చెప్పేది అమ్మాయిని కన్న తల్లిదండ్రులకు సులువులు - జాతక చక్రం మార్చేసినంత మాత్రాన బతుకులు మారిపోతే ఇకనేం? నేనెందుకిలా వుంటానూ? ముందు నా జాతకమే మార్చేసుకుని ఏ మినిష్టర్నో అయిపోనూ? అంచేత, మీరు మరో ఆలోచన లేకుండా ఈ సంబంధం వదిలేయండి. అబ్బాయి జాతకంలో బేషుకైన సంబంధం రాసుంది. మీరే చూస్తారుగా" అన్నారాయన.

"నాకు తెలీక అడుగుతానూ... ఒకవేళ ఈ సంబంధమే చేసుకుంటే ఏమౌతుందో?" అడిగేను - నా ప్రశ్నకు భారతి నా వంక అదోలా చూసింది.

"ఏముందీ - ఈ పిల్లను కట్టుకున్నాక మీ వాడు నానా బాధలూ పడతాడు. ఆ పిల్ల చెప్పిన మాట వినదు - ఎడ్డెమంటే తెడ్డెమనొచ్చు. పురుష సంతానం ఉండకపోవచ్చు - నిత్యం ఇంట్లో పోట్లాటలకు లోటుండదు - నానా రభసలూ - ఆపైన అనారోగ్యం - ఎన్నని చెప్పమంటారు" అంటూ ఆగేరాయన.

"ఒకవేళ అబ్బాయికి జాతకరీత్యా అటువంటి పిల్లే దొరుకుతుందని వుందనుకోండి. తప్పించగలమంటారా?"

"జాతకం సరియైనదై అందులో వుంటే ఎలా తప్పించగలం? ఈ పిల్లను కాదనుకున్నా ఇలాంటి మరో పిల్లయినా జతపడి తీరుతుంది. చాలా" అంటూ లేచాడాయన-

జాతకరీత్యా ఉన్నది తప్పించలేనపుడూ; లేనిది చొప్పించలేనపుడూ ఈ జాతకాలూ, పొంతన చూడ్డమెందుకో!

ఒక్కో జీవి జీవితం జీవిత భాగస్వామి వల్ల అల్లకల్లోలమై పోతుంది- తల్లి చేష్ట వల్లో; తండ్రి అలవాట్ల వల్లో అధోగతి పాలవవచ్చు. కొన్ని జీవితాలు పిల్లల వల్లే పాడైపోనూవచ్చు. తప్పించడం; తప్పించుకుపోవడం సాధ్యమయ్యే పనేనా?

ఏమైతేనేం... చక్కని పిల్ల; శుభ్రమైన సంబంధం కేవలం జాతకం బాగులేదన్న కారణంగా వదులుకోవాలనుకున్నాం. అయితే వారికి ఏమని తెలియజేయాలో అర్థంకాలేదు - బాగా ఆలోచించిన మీదట "దైవ సంకల్పం లేదు" - అనే ముక్కతో పాటు సిద్ధాంతిగారిచ్చిన సలహాను కూడా అమ్మాయి శ్రేయస్సు దృష్ట్యా రాసి పంపడం జరిగింది-

ఇది జరిగి అప్పుడే తొమ్మిది నెలల పైనే అయింది. ఈ లోగా అబ్బాయి సురేష్ ఆస్ట్రేలియాలో తనతోపాటు పనిచేస్తున్న అమ్మాయినే ఎంచుకుని ఈ జాతకాలతో నిమిత్తం లేకుండా ఇంటర్ కేస్ట్ మేరేజ్ చేసేసుకుని ఆ విషయం కంగారుపడ్డానికి వీల్లేకుండా తాపీగా తెలియజేశాడు. అలా జరుగుతుందని వాడి జాతకంలో వున్నట్టు ఒక్క సిద్ధాంతి కూడా సూచనమాత్రంగానైనా తెలియజేయలేదు మరి!

○ ○ ○

ఏదిఏమైనా ఒక ఆడపిల్ల పెళ్లికి పరోక్షంగానైనా సాయపడే అవకాశం లభించింది.

గీతలూ చక్రాలూ మనచేతిలోనే వున్నాయనుకుంటాం.

పెళ్లిళ్లు యిండియాలో జరిగినా ఆస్ట్రేలియాలో జరిగినా అవి మొదట స్వర్గంలోనే నిర్ణయింపబడతాయన్న ఆంగ్ల సూక్తి అక్షరాలా సత్యమేనేమో అన్పించింది. ■